# అలివేలు ఏడుపు

## కె.కె. రఘునందన్

తలుపు తెరవగానే గుమ్మం బయట నిల బడ్డ కూతురు అలివేలును చూస్తూనే విస్తుపోయాడు శమంతకరావు.

ఇంట్లోకి వచ్చీరావడంతోనే బావురుమంది అలివేలు.

ఎందుకేడుస్తున్నావని అడగడంతోనే తిరిగి ఏడుపుని పెంచింది. ఇంకా ఆరు మాసాలు కాలేదు అలివేలును మెట్టినింటికి పంపి. అలా పంపడానికి పదివేలయింది. కొంపదీసి ఆపది వేలూ చాలవని కొట్టిపారేసి డబ్బు పట్టుకు రమ్మని అల్లుడు కసిరికొట్టలేదు కదా! ఆ మాటలకు అహం దెబ్బతిని రాత్రికి రాత్రే వదుగెత్తుకు రాలేదు కదా!

అనేక ఆలోచనలు శమంతకరావు మనస్సును నలిపేసాయి. చిన్నప్పటినుండే అలివేలు సంగతి తనకు తెలుసు. ఏడుపుగొట్టుది. ఏమాత్రం అన్నా సహించలేదు. పీకి పాకం పట్టేరకం.

ఇంతకీ ఈ ఏడుపుగొట్టు ఏడుపుకికారణం ఆలోచిస్తూనే ప్రశ్నించాడు. "అమ్మా! అలివేలూ! అల్లుడు గారేమయినా నేను ఇచ్చిన కట్న కానుకలు నచ్చలేదని కాని, ఇంకా కావాలనికాని నిన్నేడిపిస్తున్నాడా చెప్పమ్మా!

"అదికాదు నాన్నా! అలా అయితే పర్వాలేదు. డబ్బు పడేసి ఆ ఆపదనుండీ తప్పించుకునేదాన్ని" అంది ముక్కు చీదుతూ.

"మరేమిటమ్మా! ఆడబిడ్డ నవ్వేందా దానికి నువ్వేమైనా వుడుక్కుంటే నీ భర్త అత్తగారూ నిన్ను చీవాట్లు పెట్టారా! అందువల్ల ఈరాత్రికి రాత్రే బయలుదేరి వచ్చేసావా: శమంతకరావు అనంతమైన ప్రశ్నావళికి విసుగ్గాచూసింది అలివేలు.

"అవేంకావు నాన్నా! నా ఆడబిడ్డలు చాలా మంచివారు. అత్తగారు అయినులా చల్లనిది. అని తండ్రి సందేహాల్ని తుడిచేసింది.

ఆ జవాబు విన్నాక కూతురి రాకలోని అంతర్యం కనిపించకపోవటంతో బుర్ర పీక్కోవాలనిపించింది.

"అల్లుడు నిన్ను కొడుతున్నాడా! చీటికీ మాటికీ విసుక్కుంటాడా మరిదేనికమ్మా! నీ ఏడుపు చెప్పి ఏడువు శమంతకరావు కూడా విసుక్కుంటూనే అడిగాడు.

"నాన్నా! నాభర్త నన్ను కసురుకున్నా పర్వాలేదు. కొడితే అంతకంటే సహించేదాన్ని దానికన్నా ఆయన చేతిలో నన్ను చంపేసే ఆయుధం వుంది. కళ్ళు తుడుచుకుంటూ అంది అలివేలు.

"ఆయుధమా" నోరు వెళ్ళబెట్టాడు శమంతకరావు.

"ఔన్నాన్నా! రోజూ నేను పడే హింస మరెవరూ పడ్డంలేదు. కట్టలకట్టలు కాగితాలు తెచ్చి పడేస్తారు. వాటిని నలువు చేయమంటారు. చేయలేక....చేయలేక....అని మళ్ళీఏడుపు రికార్డ్ ఆన్ చేసింది.

శమంతకరావు బుర్ర గోక్కున్నాడు.

"ఇంతకీ కాగితాలపై ఏమిటి రాస్తాడు. ఆఫీసువర్కా....అనుమానం తీరక అడిగాడు.

"కాదు నాన్నా! ఆఫీసు పనయితే ఎక్కువగా ఓ రోజుంటుంది. లేకపోతే రెండురోజులు కానీ జీవితాంతం ఆయనతోపాటు నాకూ ఉండే పని.

"ఆఁ"

"ఆయన ఏదేదో రాస్తారు....వాటిని నాకిస్తారు. ఎంతకని రాసేది. చూడండి ఈ బొటనవేలు. చూపుడువేలు ఎలా వాచిపోయాయో" అంది మరోసారి కొంగుని కళ్ళమీదకు లాక్కుంటూ.

"ఆతనిచ్చినది రాస్తేపోలా దానికిలా వచ్చేయటమెందుకూ అని ఎగిరిపోయాడు శమంతకరావు.

"మీకేం పోయింది నాన్నా! రీములకి



రీములు ఎవరు రాస్తారు. అసలే కథలు, నవలల పోటీలు ముమ్మరంగా పత్రికలవారు ప్రకటిస్తున్నారాయె. ఆరావిన ప్రతీదాన్ని నేను ఫెయిర్ చేయలేక ఛస్తున్నాను" అని యిల్లెగిరేలా కేకలేస్తూ బావురుమంది అలివేలు.

శమంతకరావుకామె ఎందుకంత హఠాత్తుగా వచ్చిందో అర్థమైంది. ●